# ట్యునీషియా : భూమి కొరకు రైతాంగ పోరాటం

**దక్షిణ** ట్యునీషియాలో అత్యంత నాణ్యమైన ఖర్జూరాలకు పేరుగాంచిన 'జేమ్నా' ప్రాంత ప్రజలు భూమి కొరకు స్ఫూర్తిదాయకమైన పోరాటం సాగిస్తున్నారు.

1912లో ఫ్రెంచి వలసవాదులు జేమ్నా రైతాంగాన్ని వారి భూముల నుండి వెళ్ళగొట్టి వారి ఖర్జూర పంటను లూటీచేసి తమ దేశానికి తరలించుకు పోయారు. స్వతంత్రంగా బ్రతికిన జేమ్నా రైతాంగం భూమిని కోల్పోయి పేదరికంలోకి నెట్టబడ్డారు.

1956లో ట్యునీషియాకు స్వతంత్రం వచ్చాక చట్టబద్ధమైన వారసులైన వారికి తిరిగి ఆ భూమిని ఇవ్వకుండా, భూమిలేని పేదలకు భూమిని పంచకుండా, అక్కడి ప్రభుత్వం భూమిని జాతీయం చేసి దానినొక ప్రభుత్వరంగ పరిశ్రమగా చేసి సాంప్రదాయక వ్యవసాయం స్థానంలో వలస విధానపు యాంత్రిక వ్యవసాయాన్ని ప్రవేశపెట్టింది. కొంతమంది రైతులకు భూమిని కౌలుకు ఇవ్వటం ద్వారా సహకార వ్యవసాయాన్ని అమలుచేయబూనుకుని ఘోరంగా విఫలమైంది. పాలకవర్గాలలోని నిర్ణయాధికార వ్యక్తుల సన్నిహితులకు కొంత భూమిని అమ్మివేసింది. ఇది చాలా అన్యాయమైన చర్యగా రైతాంగం భావించింది. జేమ్నా రైతులు కూడా అలాగే భావించారు. స్వాతంత్ర్యమంటే తమను కష్టాల నుండి గట్టెక్కిస్తుందను కున్నారు కానీ, తమ ప్రభుత్వం చేతిలోనే వారు మరో కొత్తరకపు గెంటివేతకు గురయ్యారు. భూమిలేని పేదలుగానే వలసానంతర కాలంలో కూడా కొనసాగారు.

1980లలో సరళీకృత విధానాలు వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టబడి, అమలుపరచిన తర్వాత 2002లో జేమ్నా ఒయాసిస్‌ను నిర్వహిస్తున్న పబ్లిక్‌రంగ పరిశ్రమ దివాళా తీసింది. పదవీచ్యుతుడైన నియంత బెన్ అలీకి సన్నిహితులైన ఇద్దరు ప్రైవేటు మదుపరులు అనంతరం రంగప్రవేశం చేసి అక్రమ మార్గాల ద్వారా లాభాలను మూటగట్టుకుంటూ, ప్రభుత్వానికి నామమాత్రం లీజు చెల్లిస్తున్నారు.

ఈ విధమైన పోకడల వల్ల ప్రజలలో నిరసన చెలరేగింది. 2010-11 ట్యునీషియా వెల్లువతో ఉత్తేజితులైన జేమ్నా ప్రజలు, తమ భూమిని తిరిగి పొందటానికి, అప్పటిదాకా అక్రమంగా లాభాలార్జిస్తున్న వారిని గెంటివేయటానికి విప్లవ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. బెన్ అలీ దేశం నుండి పారిపోయిన 2011 జనవరి 14కు రెండు రోజుల ముందు ఇది ఏర్పడింది. ఫలితంగా ప్రజలు తమ సమూహపు సమష్టి ప్రయోజనాల కొరకు తమ జీవితాలపై, భూములపై, వనరులపై సామూహిక అదుపు కలిగిఉంటూ ఒక నూతన ఉత్తేజపూరిత అనుభవాన్ని పొందారు.

ఆ రైతాంగం ముందుగా చేసిందేమంటే జేమ్నా ఒయాసిస్ పరిరక్షణ సంస్థ (ఏపిజెఓ)ను ఏర్పాటు చేయటం. విశాల ప్రజా సమూహానికి చెందిన అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, భూములపై వచ్చిన ఆదాయాన్ని ఖర్చుపెట్టటం, భూముల సాగు-ఈ సంస్థ ఆధ్వర్యంలోనే నడిచాయి. ఫలితాలు ఎంతో ఆశావహంగా ఉన్నాయి. 2011-14 మధ్య ఉత్పత్తి రెట్టింపైంది. 2011 ముందు ఒయాసిస్‌లో 20 మందిగా ఉన్న ఉద్యోగుల సంఖ్య 300 వరకు చేరింది. 5 సంవత్సరాలలో ఏపిజెఓ లాభాలుగా వచ్చిన వాటిల్లోంచి ఐదు లక్షల పౌండ్లు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించింది. గతంలో 2002 నుండి 2010 వరకు 9 సం॥లలో లీజుల ద్వారా ప్రభుత్వానికి చేరినది 40,000 పౌండ్లు మాత్రమే. ఈ అభివృద్ధి కార్యక్రమాలలో మార్కెట్ యార్డు నిర్మాణం, ఆటస్థలం నిర్మాణం, ప్రాథమిక మరియు సెకండరీ పాఠశాలలు, తరగతి గదుల పునరుద్ధరణ, ఆరోగ్య కేంద్రం వంటివి ఉన్నాయి. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ కోసం, అంబులెన్స్ కోసం కూడా లాభాలలో నుండి ఖర్చు చేశారు.

2010-11 ట్యునీషియా వెల్లువ వ్యవసాయం సరిగా సాగని, అధిక లాభాపేక్షతో ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాంతంలో ప్రారంభం కావటం యాదృచ్ఛికం కాదు. పండ్లవ్యాపారి మహమ్మద్ బే అజీజీ ఆత్మాహుతి సంఘటన కూడా అరబ్‌లోని ప్రజా వెల్లువలకు కదలిక తీసుకువచ్చింది. జేమ్నా అనుభవం కూడా అదే. బెన్ అలీ ప్రభుత్వ వ్యవసాయ విధానపు వైఫల్యాలను అది ఎత్తి చూపింది. ఇంకా పరిష్కారం కాని వ్యవసాయ సమస్యను అది ముందుకు తీసుకువచ్చింది.

వ్యవసాయానికి సంబంధించి సరళీకరణ, వ్యవసాయ వాణిజ్యం వంటి విధానాలు లక్ష్యంగా గల నూతన సరళీకృత పెట్టుబడిదారీ విధానపు రక్షకుల చేతిలో జేమ్నా అనేక అడ్డంకులనెదుర్కొంటోంది. రైతాంగం విముక్తి చెందటం వారికి ఇష్టం ఉండదు. ఎందుకంటే అది వారి లాభాలను దెబ్బతీస్తుంది గనుక. అమెరికా వ్యవసాయ శాఖలోని ఫారిన్ ఎగ్రికల్చర్ సర్వీస్ (ఎఫ్ఏఎస్)లోను, ట్యూనిస్‌లోని అమెరికన్ ఎంబసీలో వ్యవసాయ నిపుణుడిగాను పనిచేసిన ప్రస్తుత ప్రధానమంత్రి యూసఫ్ చాహెద్ ఈ సరళీకృత పెట్టుబడిదారీ విధానాలకు మరోపేరు. వీరు జేమ్నా రైతాంగాన్ని వారి ఏపిజెఓ సంస్థను అనేక ఇబ్బందులకు గురిచేశారు. తాము పండించిన ఖర్జూరాన్ని అమ్మబూనుకుంటే సంస్థ బ్యాంకు ఖాతాను స్తంభింప జేస్తామని 2016 అక్టోబరులో బెదిరించారు. మరో హాస్యాస్పద విషయమేమంటే వారి తొత్తులైన మీడియా ద్వారా జేమ్నా ప్రజలను నేరస్తులుగా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిగా చిత్రించటానికి పూనుకున్నారు.

పెట్టుబడిదారీ వ్యవసాయం దోపిడీతో కూడుకున్నట్టిది మరియు అభివృద్ధి నిరోధకమైనది. ఇది భూముల నుండి రైతాంగాన్ని గెంటివేసి, వారిని ఉపాధి గ్యారంటీలేని వ్యవసాయ కార్మికులుగా చేసి వారిపై దోపిడీని తీవ్రతరం చేస్తుంది. తమకున్న స్వల్పమైన నీటివనరులను ఎగుమతి చేస్తుండటం, వాణిజ్య పంటలపై కేంద్రీకరించటం వల్ల వాటికి ఎంతో ఎక్కువగా నీరు అవసరపడటంతో ట్యునీషియా నీటి సంక్షోభంలో చిక్కుకొంది. పెట్టుబడిదారీ వ్యవసాయం పర్యావరణానికి హానికరం మాత్రమే కాదు, అది శ్రామికశక్తిని ప్రత్యేకించి మహిళలను తీవ్రంగా దోపిడీ చేస్తుంది. లైంగిక వేధింపులతో సహా కష్టభరితమైన పరిస్థితులకు వారిని గురిచేస్తుంది.

మధ్య ట్యునీషియాలోని ధేరవాన్ ప్రాంతంలో యూరప్‌కు ఇంధనం ఎగుమతి చేయటానికి అవసరమైన పంటలు పండించే కార్యక్రమం చేపడుతున్నారు. దీనికి సంబంధించి 2016 ఫిబ్రవరిలో ఐసిఎల్ ఇటలీకి, ట్యునీషియా ప్రభుత్వానికి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. మొక్కల నుండి ఇథనాల్ తీయటానికి వీలుగా అరండో డొనాక్స్ అనబడే ఒక రకపు వెదురు చెట్లను పెంచటానికి ఈ ఒప్పందంలో ట్యునీషియా ప్రభుత్వం అంగీకరించింది. దీనివల్ల ప్రజలు భూముల నుండి, వారి ప్రధాన పంటల నుండి దూరం చేయబడతారు. ఇది ఆహారధాన్యాల దిగుమతికి దారి తీస్తుంది. మొత్తంగా ట్యునీషియా యొక్క ఆహార భద్రత దెబ్బతింటుంది. విదేశీ ప్రయోజనాలకు, వారి నిర్ణయాలకు తలఒగ్గి వుండటమనేవన్నీ ఇంధన భద్రత కల్పించబడుతుందన్న పేరిట జరుగుతున్నాయి. జేమ్నా ప్రజల ప్రయోజనాల కోసం మాత్రమేకాదు, మన ప్రయోజనాల కోసం కూడా మనం వారి పోరాటాలకు మద్దతు పలకాలి.

oooo